క్లుప్తంగా

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టండి


మాట్లాడుతున్న పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం

యల్లనూరు: మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని గురువారం పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పల్లెల్లో అందరూ ప్రశాంతంగా జీవించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వీపీఓలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ఎస్ఐ గిరిబాబుకు ఆదేశించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గార్లదిన్నె: శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహమ్మద్‌గౌస్ హెచ్చరించారు. గురువారం ఎస్ఐ పలు గ్రామల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలందరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. చిన్న, చిన్న విషయాలకు ఘర్షణ పడరాదన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన


మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

తాడిపత్రిటౌన్: మండలంలోని చిన్నపోలమడ గ్రామంలో గురువారం వైద్య సిబ్బంది క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, కఫం వస్తుంటే గళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు మందులను అందజేసారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సునీల్, క్రిష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీతో కందుల పంపిణీ

పెద్దవడుగూరు: మండలంలోని ఆర్బీకేల్లో రైతులకు 33 శాతం సబ్సిడీతో కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ మల్లీశ్వరి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలో కంది సాగు చేసే రైతులకు ఎల్ఆర్‌జీ-52 రకం విత్తనం అందుబాటులో ఉందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సర్మాస్ హుసేనీస్వామి దర్గాలో ఫాతేహాలు


అలంకరణలో దర్గా

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో భక్తులు గురువారం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి, నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

శివాలయాల్లో అమావాస్య పూజలు


అలంకరణలో నగరేశ్వరస్వామి

వజ్రకరూరు: మండల కేంద్రంలోని నగరేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయంలో గురువారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహా మంగళహారతి, రుద్రాభిషేకం, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. స్థానికులతోపాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. మండలంలోని జరుట్ల రాంపురం గ్రామంలోని జరుట్లరామలింగేశ్వర స్వామి ఆలయంలోనూ అమావాస్య పూజలు నిర్వహించారు. కమలపాడులోని శివాలయంలోనూ అమావాస్య పూజలు నిర్వహించి, అన్నదానం నిర్వహించారు.

దంచికొట్టిన వాన

- యల్లనూరులో 89.2 మి.మీ. వర్షపాతం నమోదు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు


యల్లనూరు మండలం జంగంపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మరువ

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రెండు నెలలుగా ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి వేడి నుంచి ఉపశమనం లభించింది. బుధవారం రాత్రి 9 గంటలకు ఉరుములు మెరుపులతో ప్రారంభమైన వర్షం గురువారం తెల్లవారుజాము 3 గంటల వరకూ కురిసింది. దాదాపు 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వీధులన్నీ జలమయమైయ్యాయి. డ్రైనేజీలన్నీ పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు వర్షపునీటితో నిండుకున్నాయి. పట్టణంలోని పోరాటకాలనీ, పీర్లమాన్యం, ఆంజనేయస్వామిమాన్యం, హరిజనవాడ, కాల్వగడ్డ తదితర ప్రాంతాలన్నీ వర్షపు నీరు చేరి జలమయయయ్యాయి. ప్రధాన రహదారి సీబీ రోడ్డులో వర్షపు నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందిపడ్డారు. అలాగే విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతోపాటు కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు బయటకు రాలేకపోయారు. అసలే అండర్ డ్రైనేజీ వ్యవస్థ అస్థవ్యస్తంగా మారడంతో ఎక్కడ మ్యాన్‌హోల్స్ తెరుచుకున్నాయోనన్న భయంతో వాహనదారులు ఎక్కడికక్కడ నిలిచిపోయారు. గురువారం మధ్యాహ్నం తిరిగి చిన్నపాటి వర్షం కురిసింది. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడి ప్రజలు సేదతీరారు.

యల్లనూరు: ఎడతెరపలేని వర్షంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంఓ 89.2 మీమీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దారు జయ ప్రసాద్ తెలిపారు. కాగా వేసవి దుక్కులకు సరైన సమయమని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు, అలాగే ఎండిపోతున్న చీనీ, మామిడి, అరటి, దానిమ్మ తదితర పండ్లమొక్కలకు ఊరట లభించిందన్నారు. అక్కడక్కడా అడుగంటిన వ్యవసాయ బోర్లల్లో నీటి మట్టం పెరుగుతుందన్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో బుధవారం రాత్రి, గురువారం రెండు రోజులు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఏఓ సోమశేఖర్ మాట్లాడుతూ మండలంలో 8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందన్నారు. వర్షం రాకతో రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారన్నారు. అలాగే పశువుల మేతకు ఇబ్బంది లేదన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు కూడా పంపిణీ చేస్తామన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం



పుట్లూరు: మండలకేంద్రంలోని భోగేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న భారీ వృక్షం బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నేలకొరిగింది. ఈ వృక్షం తూర్పు దిశగా పడటంతో ఆలయంపై కాకుండా ఖాళీ ప్రదేశంలో పడిందని గ్రామస్తులు తెలిపారు. ఈ వృక్షానికి దాదాపు 100 సంవత్సరాలకు పైగా ఉంటుందన్నారు.


తాడిపత్రిలోని సీబీ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు


తాడిపత్రిలోని హరిజనవాడలో చేరిన వర్షపు నీరు


యల్లనూరు వద్ద పొంగిపొర్లుతున్న వంక


యల్లనూరు మండలంలో చీనీతోటలో నిలిచిన వర్షపు నీరు


యల్లనూరు-గడ్డంవారిపల్లికి వెళ్లే దారిలో రాకపోకలకు అంతరాయంగా నీరు


పాతపేట చౌడమ్మ గుడి వద్ద పారుతున్న వర్షంనీరు

మొక్కల పెంపకంతోనే పర్యవరణ పరిరక్షణ


యాడికిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ చల్లుతున్న దృశ్యం


పెద్దవడుగూరు మండలం కోనాపురంలో సీడ్ బాల్స్ చల్లుతున్న చిన్నారులు

యాడికి: మండల కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నంబర్- 1 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో వేరుశనగ, బెండ, రాగులు, కాకర విత్తనాలను చిన్నారుల చేత చల్లించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయలు, ఇళ్ల ఆవరణలు, ఇతర ప్రదేశాల్లో మొక్కలు నాటాలని కోరారు. ప్రతి జీవికి చెట్లు ప్రాణ ధారమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: పర్యావరణాన్ని రక్షించుకోవడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంషాద్‌బేగం అన్నారు. గురువారం మండలంలోని కోనాపురం, క్రిష్టిపాడు గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చిన్న పిల్లలతో మట్టిముద్దలను చేయించి వాటిలో మొక్కల విత్తనాలు పెట్టి నాటించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


తాడిపత్రిలో మొక్క నాటుతున్న పెన్నా సిమెంట్స్ జనరల్ మేనేజర్ క్రిష్టయ్య

తాడిపత్రిటౌన్: మొక్కల పెంపకం తోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పెన్నా సిమెంట్స్ జనరల్ మేనేజర్ క్రిష్టయ్య యాదవ్ అన్నారు. మండలంలోని తలారిచెరువు గ్రామ సమీపంలోని పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫ్యాక్టరీలో సుమారు 300 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు వృక్షాలే ఆధారమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. కార్యక్రమంలో మైన్స్ మేనేజర్ రామక్రిష్ణారెడ్డి, సిబ్బంది రాంప్రసాద్, రవీంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాష్కర్‌రెడ్డి, జయక్రిష్ణ, మహేశ్వరెడ్డి పాల్గొన్నారు.


తాడిపత్రిలో చిన్నారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తాడిపత్రి అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మిదేవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ-మనందరి బాధ్యత అంటూ చిన్నారులచే ప్రతిజ్ఞ చేయించారు. అనతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ఇందు కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన పరమేష్


గాయపడిన మల్లికార్జున

గుత్తి రూరల్/పెద్దవడుగూరు: గుత్తి మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. యాడికి మండల కేంద్రానికి చెందిన పరమేష్, మల్లికార్జున కర్నూలు జిల్లా జొన్నగిరి గ్రామ శివారులో వజ్రాల వేటకు వెళ్లారు. అనంతరం తిరిగి యాడికికి బయలుదేరారు. ఇదే సమయంలో రాయలచెరువుకు చెందిన వ్యక్తులు ద్విచక్ర వాహనంలో గుత్తి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యమంలో పెట్రోల్ అయిపోయింది. దీంతో ఇరువురు బండి తోసుకుంటూ వెళ్తుండగా వెనకనుంచి పరమేష్, మల్లికార్జున బైక్‌లో వెళ్తూ ఢీకొన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వారిని స్థానికులు చికిత్స నిమిత్తం వెంటనే గుత్తి ప్రభుత్వాపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి మహిళకు గాయాలు

యాడికి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి మహిళ తలకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చందన గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మీ కాంతమ్మ తన కుమారుడు తేజతో కలసి ద్విచక్ర వాహనంలో రాయలచెరువుకు బయలు దేరారు. చందన గ్రామ చివరన రాయలచెరువుకు పోయే మార్గంలో ఉన్న వ్యవసాయ బోరుబావుల వద్ద రైతులు ఇటీవల పొలాలకు పైపులైను ఏర్పాటు చేసేందుకు రోడ్డును తవ్వి మళ్లీ మట్టిని కప్పటంతో పెద్ద స్పీడు బ్రేకరు మాదిరిగా ఉంది. గమనించని తేజ ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడపడంతో.. వాహనం అదుపు తప్పి వెనుక కూర్చొన్న లక్ష్మీకాంతమ్మ కింద పడటంతో చెవులో నుంచి రక్తం వచ్చింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా పైపులైను కోసం రోడ్డును తవ్విన చోట ఎగుడుదిగుడు లేకుండా రైతులు రోడ్డును చదును చేయాలని వాహనదారులు కోరారు.

రేపు 'మ్యూజికల్ నైట్స్'

గుత్తి: పట్టణంలోని కేఎం ఫంక్షన్ హాల్ (ఓల్డ్ రాయల్ సినిమా థియేటర్)లో ఈ నెల శనివారం మ్యూజికల్ నైట్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బాలసుబ్రమణ్యం కల్చరల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. బాల సుబ్రమణ్యం జయంతి వేడుకల్లో భాగంగా మ్యూజికల్ నైట్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విరామ బైబిల్ పాఠశాల ప్రారంభం


విరామ బైబిల్ పాఠశాలను ప్రారంభిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో సంఘం ఆధ్వర్యంలో నాలుగురోజుల పాటు నిర్వహించనున్న చిన్నపిల్లల విరామ బైబిల్ పాఠశాలను మొదటిరోజు గురువారం ప్రార్థనతో ప్రారంభించారు. పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ సారథ్యంలో పాస్టరమ్మ సువర్ణమ్మ, సండే స్కూల్ టీచర్ ఎస్ ప్రిస్కిల్లా, విరామ బైబిల్ పాఠశాల టీచర్లు ఏసుకాంత్, డేవిడ్ ప్రిన్స్ పాఠశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రార్థన వల్ల చేకూరే ప్రయోజనాలు, ప్రాముఖ్యత గురించి ప్రయోగాత్మకంగా తెలిపారు. అలాగే ఏసుక్రీస్తు ప్రభువు ఎన్నో మహత్యాలను గురించి వివరించారు. ఆటపాటలతో కూడిన దైవజ్ఞానాన్ని వారు ప్రబోధించారు. విరామ బైబిల్ స్కూల్ ప్రాముఖ్యతను వివరించారు. చిన్ననాటి నుంచే పిల్లలను సన్మార్గంలో పయనింపజేయడానికి విరామ బైబిల్ స్కూల్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు స్నాక్స్, సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, బుజ్జిబాబు, అబ్రహాం, బాలు, రాజబాబు, సురేష్, లక్ష్మీనారాయణ, స్టానీ, ప్రభంజన్, ప్రసాద్, రజని, వాణి, మహిమ, రేచెల్, ప్రియదర్శిని, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

అన్వరానంద స్వామి ఊరేగింపు

కంబదూరు: మండలంలోని ఓబగానపల్లిలో గురువారం వైశాఖ మాస అమావాస్యను పురస్కరించుకుని అన్వరానంద స్వామి చిత్ర పటాన్ని ప్రధాన వీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పాటలు పాడారు.

పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు

గార్లదిన్నె: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈఓ-2 వెంకటరమణ నాయక్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 1వతరగతి నుంచి 10 తరగతి వరకూ అన్ని సబ్జెక్టు పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. వచ్చిన పాఠ్య పుస్తకాలను గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్లో భద్రపరిచామన్నారు. ఈ నెల 12న ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం నాటికి విద్యార్థులకు అందజేస్తామన్నారు.

కిరాణాషాపులో చోరీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో కృష్ణమూర్తి అనే వ్యక్తికి చెందిన కిరాణాషాపులో చోరీ జరిగింది. గురువారం ఉదయం కృష్ణమూర్తి దుకాణాన్ని తెరవగా, చోరీ జరిగినట్లు గుర్తించాడు. రేకులషెడ్డులో నిర్వహిస్తున్న షాపు వెనుక వైపు రేకును కోసి దుండగులు ప్రవేశించి, చోరీకి పాల్పడ్డారు. రూ.25 వేల నగదు, రూ.50 వేల విలువైన సరుకులు చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.